# కనకవల్లి కథ

కనకవల్లి కథకి కాళ్ళూ చేతులూ లేవు. అందులో నీతీ బూతూ లేదు.

కనకవల్లికో తల్లీ, తండ్రీ, ఇద్దరక్కలూ ఒక అన్నా ఉండేవాళ్ళు. తండ్రిని చూసి కనకవల్లి తల్లీ, అక్కలూ, అన్నా అంతా వొణికేవాళ్ళు. ఆయన ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు, ఎవరికేసీ క్షణంకన్న చూసేవాడు కాదు. ఎక్కువసేపు ఇంట్లో ఉండేవాడు కాదు. ఇంట్లో ఎవరికీ ఆయనతో పరిచయం ఆటే లేదు.

కనకవల్లి చిన్నతనంలోనే తన కాబోయే మొగుణ్ణి గురించి ఆలోచించుకున్నప్పుడు తండ్రివంటి మనిషే స్ఫురణకు వచ్చేవాడు. తన మొగుణ్ణి చూసి తనే కాక ప్రపంచమంతా కూడా హడలి చస్తుందని కనకం భావించుకునేది.

ఇది నిజం కాలేదు. కనకవల్లికి దొరికిన మొగుడు మేకవంటివాడు. అతని మొహం చూస్తే ప్రపంచ భారమంతా తనమీదే పడ్డట్టుండేవాడు. ఎవరు పలకరించినా జాలిగా మొహంపెట్టి, "అట్లాగే! దానికేం? నే కాదన్నానా?" అనేవాడు. "నన్ను తొందర చెయ్యకండిర్రా, అసలే ప్రపంచభారం మొయ్యలేక చస్తున్నాను. మీరు నన్నింత తొందరచేస్తే ఎట్లా?" అన్నట్టు.

"వీడు నా మొగుడు కాడు!" అనుకుంది కనకం. కాని వాడే తన మొగుడని రూఢి అయింది........

పద్నాలుగో పుట్టినరోజు కనకం అత్తవారింటో చేసుకుంది. కనకం అత్తవారింటో ఓ ఆచారం ఉంది. కనకం మామగారూ, అత్తగారూ, బావ మరుదులూ - అందరూ ఏకగ్రీవంగా తమ కొంప దివాలా ఎత్తటానికి సిద్ధంగా ఉన్నట్టు మాట్లాడేవాళ్ళు.

"అయ్యో, చూశావుటే, కనకం! బీరకాయలు సవాశే రర్ధణాటా![1] ఇక కూరలు చేసుకున్నట్టే కొంపలో! చాల్లేమ్మా, పచ్చళ్లు తిని బతకలేమా ఏమిటి?" అనేది అత్తగారు.

కనకం మొదట్లో ఆశ్చర్యపడిందిగాని తరవాత క్రమంగా వాళ్ళు చెప్పేదాన్లో చాలా వివేకం ఉన్నట్టు నమ్మసాగింది. కనకం అత్తగారు, మామూలు మధ్యమ తరగతి కుటుంబాలు కొనేవే కొనటానికి ప్రయత్నించేవాళ్ళు. కాని ధరలు ప్రతిదీ మండిపోతుంటే చస్తారా? ఆ వస్తువులు లేకుండా తమకు జరగదని ఆమ్మేవాళ్ళ అనుమానం! ఎందుకు జరగదూ వాళ్ళ చాదస్తంగానీ? కూర అనేది వండకుండా నెలకు ఇరవైరోజులు గడిచేది_కూరలమ్మే వాళ్ళ తిక్క అంతటితో అణిగేది. మజ్జిగ నీళ్ళు లేకుండా నెల కయిదురోజులన్నా గడిచేది. కనకం అత్తగారు మజ్జిగ లేనిపూట ఇంత పల్చని చారు పెట్టేది. ఆ చారు పోసుకుని కనకం మామగారూ, బావ మరుదులూ "చారెంత బాగా కుదిరిందే! దీని ముందర గేదె పెరుగెందుకు?" అనేవాళ్ళు. అన్నం తినటానికి కూచుని చారు పోసుకోగానే కనకానికి చారు గేదె పెరుగుకన్న బాగా ఉన్నట్టే ఉండేది. ఒక్కోసారి ఇంటో నెయ్యి కొద్దిగానే ఉండేది.

"నెయ్యి జాగర్తగా మగవాళ్ళకు సర్దే, కనకం మనకు పూట లేకపోతే ఇంతలో ఏమవుతుంది?" అనేది అత్తగారు.

---

1. సవాశేరు = $1\frac{1}{4}$ శేరు. శేరుకు ఇరవై తులాలు, 200 గ్రాములు అర్ధణా, అణాలో సగం - మూడు కాణలు. రూపాయకు 16 అణాలు - 96 కాణలు.

చిత్రమేమంటే కనకానికి అత్తగారింటో ఏమాత్రమైనా కష్టపడుతున్నానేమోననే ఆలోచనే వచ్చేదికాదు. తన్నెవరూ పొదుపుగా వుండమని నిర్బంధించటం లేదు. అనేక ఆటలకు నియమాలున్నట్లే ఈ కాపరానికి పొదుపు ఒక నియమం. నియమభంగం జరక్కుండా కాపరం పట్టుకు రావటంలో తనుకూడా సాయపడుతున్నందుకు కనకానికి ఏదో గర్వంగా వుండేది. తన మామగారి కాపరాన్ని దివాలా తీయకుండా తాను స్వయంగా కనిపెట్టి వున్నంత గర్వం ఆమెకి కలిగేది. ఆమెకు ఒక అద్భుతమైన ఉద్యమంలో జయప్రదంగా పాల్గొంటున్నాననే భావం కలిగేది....

దీపావళికి కనకవల్లిని అన్న వచ్చి తమ ఉద్యోగం చేస్తున్న ఊరికి తీసికెళ్ళాడు.

బండి దిగి ఇంటో అడుగుపెట్టే టప్పటికి కనకం వొదినెగారు వంట చేస్తున్నది. భగోణీలు ఉడకేసిన బంగాళాదుంపలు వేసి నేతిగిన్నె కుమ్మరిం చేస్తున్నది వొదినెగారు. అది చూసి కనకానికి ఒక్కక్షణం గుండె ఆగిపోయింది. "ఆగు!" అని ఒక్క కేక పెడదామనుకుంది. కాని నోట మాట రాలేదు.

వదినెగారు భగోణీకలే బెట్టి శిబ్బి మూతబెట్టి లేచివచ్చి, "కాళ్ళు కడుక్కో" అంటూనే మొగుడి వంక చూసి, "స్నానం చెయ్యటానికేనా సిద్ధమవుతున్నారు? ఒక్కక్షణ మాగండి వేణ్ణీళ్ళు పెడతాను," అన్నది.

"వొద్దులేవే! చన్నీళ్ళు చేస్తాలే... కనకానికి పెట్టు"

"అందరికీ పెడతాను, చన్నీళ్ళు చెయ్యకండి."

కనకం పంచప్రాణాలూ చెవుల కెక్కించి తన అన్నగారి గొంతూ వొదినెగారి గొంతూ ఆలకిస్తున్నది. వాళ్ళిద్దరి మధ్యా జరిగిన మాటల్లో ఏమీ ప్రత్యేకించలేదు గాని, వాళ్ళ గొంతుల్లో తనకు తెలీనిదేదో వున్నట్టు ఆమె కనుమానం తట్టింది.

ఆ అనుమానమే భోజనాల దగ్గిరకూడా కనకానికి మళ్ళీ తట్టింది. తన వొదినెగారు భర్తకి వడ్డించేటప్పుడు ఆవిడగారి చేతి కదలికలు ఏమిటో కనిపించింది కనకానికి. అదేమిటో అర్థం కాలేదు.

ఆ క్షణంలోనే కనకం గుండె ఆగిపోయి మింగబోతున్న ముద్ద గొంతు కడ్డం పడ్డంత పని అయింది కనకానికి. ఎందుకంటే వొంగి వడ్డించే భార్య జుట్టు, ఎడంచేత్తో నిమిరి, "నెత్తినిండా బూజేమిటే, భడవా?" అన్నాడు కనకం అన్న.

"పండక్కాదుటండీ, ఇల్లంతా దులిపాను – వొదినెగారు వచ్చేటప్పటికి

ఇల్లుసహ్యంగా వుంటే బాగుండదని!" అంటూ కనకం వొదినె భర్త మొహంలోకి చూడటానికి ప్రయత్నించింది.

"మంచిపని చేశావు!" అన్నా డతను.

కనకాని కిప్పటికి రూఢి అయింది - తనకు తెలీనిదేదో తన అన్నకీ వొదినెకీ మధ్య నడుస్తున్నదని, కనకం కళ్ళకి తన వొదినెగారు ఎంతో అందంగా వున్నట్టు తోచసాగింది....ఆవిడ తన అన్న వంక చూసినప్పుడు మాత్రమే కాకుండా తన వంక చూసినా, తనతో మాట్లాడినా కూడా ఆ అనిర్వాచ్యమైన అందం ఏదో ఆమెలోనుంచి బయటికొస్తున్నట్టు కనిపించింది.

తనకు తన అన్నవంటి మొగుడు దొరికితే బాగుండేదా అనే శంక కనకాన్ని బాధించసాగింది. సమాధానం మట్టుకు దొరకలేదు........

పండగనాటికి మరో అతిథి వచ్చాడు - శ్రీరాములు అతను తన వొదినె గారి పింతల్లి కొడుకుట. తన అన్నని "ఏంరా?" అని పిలిచాడు. ఇద్దరూ కాలేజీలో కలిసి చదివారుట.

"ఈ అమ్మా యెవ్వరా?.... మీ చెల్లెలే?.. కాపరాని కెళ్ళిందా?....అప్పుడే? ఎవడ్రా దౌర్భాగ్యుడూ? రెండేళ్ళాపలేక పోయినారూ?....ఎవరి కిచ్చారేం? ఏమో, తెలిసినట్టు లేదు....మా ఆవిడా? ఉందట్లా! చావూ, బతుకూ కాకుండా! ...పాపం, నరకం ఇక్కడే అనుభవిస్తున్నది."

శ్రీరాముల్ని చూస్తే కనకానికి భయంవేసింది, కొట్టవచ్చేట్టు మాట్లాడు తాడు. చూడటానికీ ముగ్గుర్ని కొట్టేట్టున్నాడు. అటువంటి వాడి పెళ్ళామైన మనిషి ఏం బతుకుతుంది?....పెళ్ళాంతోనూ ఇట్లాగే కొట్టొచ్చేట్టు మాట్లాడుతాడు గామాలు?

మేకవంటి వాడు దొరకటం తనకెంత అదృష్టం అనుకుంది కనకం....

నాలుగేళ్ళు గడిచినై. కనకానికి పిల్లల్లేరు. ఈలోపల కనకం ఆటే ఎదగలేదు, కనకం అత్తవారింటో పొదుపుగా జరిగిపోతున్నది.

ఈ నాలుగేళ్ళ కాలంలోనూ ఆయింటో జరిగిన మార్పేమిటంటే కనకం భర్త అపూరి కో ఆపరేటివ్ బ్యాంకులో చిన్న గుమాస్తా ఉద్యోగం సంపాదించాడు.

ఓరోజు భర్తవెంట ఇంకో మనిషికూడా వచ్చాడు.

"తాగేటందుకు కాస్త మంచినీళ్ళుగాని మజ్జిగగాని ఇప్పించవోయ్!"

ఆ గొంతు వినగానే కనకం గుండె టక్కున ఆగింది; "పింతల్లికొడుకు," అనుకుందామె. వెంటనే ముగ్గుర్ని కొట్టగల ఆకారం కళ్ళ ఎదట కనిపించి నట్టయింది. నిన్న చూసినంత బాగా జ్ఞాపకం వచ్చాడు.

"మజ్జిగా ..చెయ్యలేదేమో నండీ," అంటున్నాడు భర్త బాధగా-ఎవరో తన్ను తొందర చేస్తున్నట్టు-మేకల్లే!

"పోనీ మంచినీళ్ళుంటైగా, చేసి సిద్ధంగా?"

"ఇదుగో, కాసిని మంచినీళ్ళు పట్టుకొస్తావూ?"

పింతల్లి కొడుకును చూస్తే కనకానికెందుకో మండిపోయింది. దబదబా గ్లాసులో మంచినీళ్ళు పట్టుకుని నడవలోకి వచ్చి చూసేటప్పటికి నిజంగా శ్రీరాములే!

"మీరా?" అన్నది కనకం.

"నిన్నెక్కడా చూసినట్టు జ్ఞాపకంలేదే, అమ్మాయ్?"

"నేను మీకమల ఆడబిడ్డని."

"అట్లా చెప్పు! కిష్టుడి చెల్లెలివికాదూ? ఇదా మీ అత్తవారిల్లూ వీడా-ఇతనా నీభర్తా?" అంటూ శ్రీరాములు కనకం భర్తకేసి విచిత్రంగా చూశాడు.

మీ అవిడ కెట్లావుంది అన్నది కనకం, ఏదో చప్పున జ్ఞాపకం వచ్చిన దానల్లె.

"ఆ ప్రశ్న అడగగానే శ్రీరాములు కనకం కళ్ళ ఎదటకుంగి చిన్నసైజు మనిషి అయిపోయినట్టయి, నిర్జీవమైన గొంతుతో, "అప్పుడే పోయింది. నాలుగేళ్ళయింది," అన్నాడు.

శ్రీరాములు గొంతు, అతని మొహం వాలకమూ చూస్తుంటే కనకానికి తన అన్న భార్య ఎందుకో జ్ఞాపకం వచ్చింది.

"మళ్ళా పెళ్ళి చేసుకున్నారా?" అంది కనకం. శ్రీరాములు కనకం కేసి చూసి బలవంతంగా నవ్వి, "హుఁ!" అన్నాడు....

శ్రీరాములు గారికి బాంకులో మేనేజరు పనిట. కనకం భర్త అయన్ని అప్పుడప్పుడూ భోజనానికి పిలుస్తూ ఉండేవాడు; తన భార్యద్వారా శ్రీరాములు తనకూ చుట్టమేననేది ఆయన ఎదట స్మరించుతూ ఉండేవాడు. శ్రీరాములు గారిని తిరిగి పెళ్ళాడమని, హోటలు తిండి ఏమిటనీ హెచ్చరించేవాడు.

ఆమాట అన్నప్పుడల్లా శ్రీరాములు మొహం మారిపొయ్యేది. "నాకున్న ప్రేమంతా చచ్చిపోయినదానికిచ్చుకున్నాను. మళ్ళా పెళ్ళిచేసుకొని వచ్చే ఆవిద కేమివ్వను?" అనేవాడు.

ఈమాట కనకం చెవిన పడ్డప్పుడు, "అన్నీ అబద్ధాలు అనుకున్నది. కాని ఆమె వొంటిమీద రోమాలు మాత్రం నిక్కబొడుచుకున్నై. ఎవరూ ప్రేమ గురించి మాట్లాడటం కనకం వినలేదు....

"అమ్మాయి, కిష్టణ్ణి చూడబోతున్నాను, వస్తావా?" అన్నాడు శ్రీరాము లొకసారి కనకంతో.

"చూసి చాలా రోజులయింది, పోని వెళ్ళిరా. పిల్లవాడు పుట్టినాక వెళ్ళి చూడలేదనుకున్నావుగా?" అన్నాడు భర్త.

కనకం శ్రీరాములు ఖర్చుమీద అన్నగారింటికి బయల్దేరింది. రైల్లో శ్రీరాములుగారు పెద్దమనిషి తరహాగా ప్రవర్తించలేదు.

"చూడమ్మాయి, నీకీ త్రాష్టంగా డెక్కడ దొరికాడు? కిష్టుడి చెల్లెలు గనక చెబుతున్నాను....వీడు వట్టి పీనుగ కానీ ఖర్చుచేసి తినలేడు. మీ మామ గారు అంతే. వాళ్ళంతా అంతే....నువు సుఖంగా ఉన్నావా?" అన్నాడు శ్రీరాములు.

కనకానికి మోహం జేవురించింది, ఏడుపూ వచ్చింది, తల వొంచుకొని, "సుఖంగానే ఉన్నాను," అన్నది. రైలైపోయింది గాని లేకపోతే కనకం అప్పటి కప్పుడే వెనక్కి తిరిగిరావలసినంతపని!

"నిన్ను చూస్తే జాలేస్తున్నది. నీకు గట్టిగా పది హేడేళ్ళున్నట్టు లేదు. అప్పుడే నువ్వా నరకానికి అలవాటు కూడా ఆయిపోయినావు. కిష్టుడికి సంగతి చెబితే చాలా విచారిస్తాడు....నీకు సుఖపడాలని లేదా?"

"సుఖంపడుతూనే ఉన్నాను."

"పడుతున్నావని నువ్వనుకుంటున్నావు!" అన్నాడు శ్రీరాములు ఆకస్మాత్తుగా గొంతు హెచ్చించి గద్దిస్తూ." ఏం సుఖపడుతున్నావు?నీలో ఆడ తనం ఏమీలేదు. జీవం ఉన్నక్షణం ఒక్కటిగూడా లేదు. ఓ గుమ్మడికాయలో ఉన్నంత చైతన్యం కూడా నీలో నాక్కనిపించడంలేదు....మీ ఆడవాళ్ళను చూస్తే ఇందుకే నాకసహ్యం వేస్తుంది. దుర్భరమైన పరిస్థితులెందుకు భరిస్తారు? ఎదురు తిరిగి ఎందుకు పోట్లాడరు? ఎవణ్ణన్నా ప్రాణం ఉన్నవాణ్ణిచూసి వాడి వెంట ఎందుకు లేచిపోరు? చచ్చేనాటికి మీ అనుభవమంతా కలిసి ఏమిటి? ఏమీ లేదు!...."

అంతే శ్రీరాములింకేమీ మాట్లాడలేదు.

కనకం వంచినతల ఎత్తనేలేదు. నిశ్శబ్దంగా ఏడవసాగింది. బుద్ధి తెలిసిం తరవాత మనస్సు బాధపడి ఏడవటం ఆమెకిదే మొదటిసారి.

తను ఎందుకేడిచిందీ ఆమెకి తెలీదు. శ్రీరాములు తన్నేడిపించినట్టు ఆమె భావించుకోలేదు. అతను తననునుసరించి ప్రత్యేకించి ఏమీ అన్నట్టూలేదు. అందర్నీ గురించీ అన్నముక్కకూడా ఏదోబాధ పడుతున్న వాడల్లే అన్నాడు గాని బాధ పెట్టేవాడల్లె అనలేదు. ....పోనీ తన కేడుపు రావటానికి కారణం

తను అత్తవారింట పడే కష్టాలూ కావు – తను పడిన కష్టాలే మున్నె?.... అయితే ఎందుకేడిచినట్టూ? అదిమాత్రం తెలియరాలేదు.

శ్రీరాములంటే హడలుమాత్రం జాస్తి అయింది. ఆయన దారి పొడుగూతా మరి మాట్లాడనేలేదు....

అన్నగారింటినుంచి తిరిగి రాగానే కనకంకళ్ళకి అత్తగారిల్లు మారినట్టు కనిపించసాగింది.

తన భర్త ప్రేమ ఏమిటో తెలియని వొట్టి మొద్దులాగా కనిపించాడు.... ఎన్నడైనా తనతలతాకి "జుట్టు సరిగా తుడుచుకోలేదేం?" అన్నాడా?....తన అన్న తన వొదినగార్ని అన్నట్టు.

తన అత్తగారూ, మామగారూ, బావమరుదులూ అందరూ వొట్టి పిసినిగొట్టుగా కనిపించారు. వాళ్ళ కొంప నిలబెట్టేభారం ఇప్పుడు తనమీద ఉన్నట్టు తోచలేదు....అసలు వాళ్ళ కొంపకేం తెగులు? పదిహేనుపుట్ల గింజలువస్తై....

మజ్జిగ లేకుండాగాని, నెయ్యి లేకుండాగాని అన్నం తినవలిసొస్తే, "నా దగ్గిర మాఅన్న ఇచ్చిన డబ్బులున్నై, కొనుక్కురండి!" అన బుద్ధవుతుంది...

జీవితం నిజంగానే ఎంతో హేయంగా ఉంది....

తనది ప్రేమరహితమైన జీవనమని తెలుసు.... కాని ఎవరితోనూ లేచి పోదామనిలేదు....ఈ జీవితంలో మార్పు కలుగుతుందనే ఆశ అంతకన్నా లేదు....

ఈ విధంగా ఎంతకాలం గడవాలో?....తనకింకా పద్దెనిమిదేగా ఏళ్ళు?.... ఇంకా నలభై, యాభై, అరవై, డెబ్భై....ఎన్ని సంవత్సరాలు బతకాలో?....

అదృష్టవంతురాలు శ్రీరాములుభార్య!....చచ్చిపోతే ఏం?....తనలో ఉన్న ప్రేమంతా ఇచ్చానన్నాడు....అదేమిటో తెలుసుకుని మరీ చచ్చింది!....అది తెలుసుకోవటం ఎట్లా ఉంటుందో?....

[ప్రథమ ముద్రణ : మే 1945, సూర్యప్రభ మాసపత్రిక]